

3

గాంధీ భవన్ ముందు సీఎం, టీపీసీసీ అధ్యక్షుడి చిత్రపటాలకు

## క్షీరాభిషేకం చేసిన జహీరాబాద్ నేతలు




# మనం

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

గురువారం । 18 । జూన్ । 2026 పేజీలు: 7




## అధికారుల నిర్లక్ష్యమా.. పర్యవేక్షణ లోపం?

కళ్ళముందే జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రేక్షక పాత్ర వహిస్తున్న మున్సిపల్ అధికారులు.

సంగారెడ్డి మున్సిపాలిటీలో రెచ్చిపోతున్న రియాల్టర్లు.

మున్సిపల్ అధికారుల తీరుపై పలు అనుమానాలు

తక్షణమే అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

2

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేక ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ మంత్రి హరీశ్రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు.

2

ప్రజలే తీర్పు చెప్పబోతున్నారు!

హుస్నాబాద్లో హరీశ్రావు హెచ్చరిక

హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం

రైతు నుంచి జర్నలిస్టు వరకు ప్రతి వర్గం నిరాశలోనే ఉందన్న మాజీ మంత్రి

ఎస్ఐఆర్ ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా

వట్పల్లి పోలీస్ స్టేషన్, జోగిపేట సర్కిల్ కార్యాలయాలను

## తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలన.

సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి.

మీరు నేర్చుకున్న ఈ పని సర్వీస్ కాలం ఉపయోగకరం.

వట్పల్లి పోలీస్ స్టేషన్, జోగిపేట సర్కిల్ కార్యాలయ అధికారుల, సిబ్బంది పనితీరు బాగుంది

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.

3



# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది





**ప్రజలే తీర్పు చెప్పబోతున్నారు!**
**హుస్నాబాద్లో హరీశ్రావు హెచ్చరిక**
**హామీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం**
**రైతు నుంచి జర్నలిస్టు వరకు ప్రతి వర్గం నిరాశలోనే ఉందన్న మాజీ మంత్రి**
**ఎస్ఐఆర్ ప్రక్రియపై కార్యకర్తలకు దిశానిర్దేశం**
**బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా**

హుస్నాబాద్,రిపోర్టర్: జూన్17మనం న్యూస్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేక ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ మంత్రి హరీశ్రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

సభ ప్రారంభం నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విరుచుకుపడిన హరీశ్రావు, తెలంగాణ ఉద్యమ చరిత్రలో హుస్నాబాద్కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు ఈ ప్రాంతంపై ప్రత్యేక అభిమానం ఉండేదని, ఎన్నికల ప్రచారానికి తరచూ హుస్నాబాద్ నుంచే శ్రీకారం చుట్టేవారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలోనే హుస్నాబాద్ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్కు అండగా నిలిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలు అందించారని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్కు అనేక అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చామని, మినీ ఆర్టీసీ డిపోను పూర్తి స్థాయి డిపోగా మార్చడంతో పాటు తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి దశాబ్దాల కలలను నెరవేర్చామని తెలిపారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త అభివృద్ధి పనులు చేయడం పక్కనపెట్టి, ఇప్పటికే ప్రారంభమైన పనులను కూడా పూర్తి చేయలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు.

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ కార్యకర్తలకు హరీశ్రావు ప్రత్యేక సూచనలు చేశారు. ఇది కొత్త ప్రక్రియ కాదని, ప్రతి 20 ఏళ్లకు ఒకసారి ఎన్నికల సంఘం నిర్వహించే సాధారణ ప్రక్రియేనని వివరించారు. డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు, అర్హులైన ఓటర్ల వివరాల నమోదు వంటి అంశాల్లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, కేసీఆర్ మద్దతుదారుల పేర్లు జాబితాలో ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించిన హరీశ్రావు, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి పథకాలు అమలులో పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. రైతులకు ప్రకటించిన రైతుబంధు నిధులు ఇప్పటికీ అందలేదని, రైతు బీమా చెల్లింపులు నిలిచిపోయాయని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రచారం చేస్తున్నా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో నిధులు అందడం లేదని విమర్శించారు.

గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలతో నిర్వాసితులకు న్యాయం చేసి ప్రాజెక్టుకు నీళ్లు అందించే స్థాయికి తీసుకొచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు ముందుకు కదల్లేదని అన్నారు.

జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రస్తావిస్తూ హరీశ్రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయించామని, వాటి అభివృద్ధి పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోవడం దాని అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. జర్నలిస్టులు, రైతులు, యువత, మహిళలు సహా ప్రతి వర్గం ప్రస్తుతం నిరాశలో ఉందని అన్నారు.

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఏకైక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్న హరీశ్రావు, 119 నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం, కార్యకర్తల బలం ఉన్న పార్టీగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. తెలంగాణ కోసం పదవులను త్యాగం చేసిన నాయకత్వం తమదేనని, ప్రజల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని, ముఖ్యంగా రైతాంగం కాంగ్రెస్కు మద్దతు ఇవ్వబోదని హరీశ్రావు వ్యాఖ్యానించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తూ సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవాన్ని కలగలిపిన పాలన అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సభలో మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి జీవన్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్కుమార్తో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సభ ప్రాంగణం బీఆర్ఎస్ నినాదాలతో మార్మోగింది.

# అధికారుల నిర్లక్ష్యమా.. పర్యవేక్షణ లోపం?

**కళ్ళముందే జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రేక్షక పాత్ర వహిస్తున్న మున్సిపల్ అధికారులు.**
**సంగారెడ్డి మున్సిపాలిటీలో రెచ్చిపోతున్న రియాల్టర్లు.**
**మున్సిపల్ అధికారుల తీరుపై పలు అనుమానాలు**
**తక్షణమే అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి**







సంగారెడ్డి, జూన్ 17 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది అధికారుల నిర్లక్ష్యమా పర్యవేక్షణ లోపమా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి పట్టణ కేంద్రంలో మున్సిపల్ అధికారుల కళ్ళముందే జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్న మున్సిపల్ అధికారులపై సంగారెడ్డి ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారులు సారంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పట్టణంలో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారవేస్తే రూ.5 వేల వరకు జరిమానా విధిస్తూ కఠిన నిబంధనలు అమలు చేస్తున్న మున్సిపల్ యంత్రాంగం, మరోవైపు బహిరంగంగానే కొనసాగుతున్న అక్రమ కట్టడాలను గుర్తించలేకపోతుందా..? అనే ప్రశ్నలను ప్రజలు లేవనెత్తుతున్నారు. చిన్న విషయాల్లో కఠినంగా వ్యవహరించే అధికారులు, అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రంగా నోటీసులు అందజేసి అనంతరం చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్ర వహించడం వెనుక కారణాలేమిటని ప్రజలు మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ తరహా వ్యవహారం అధికారుల పనితీరుపై పలు ఆరోపణలకు దారితీస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సంగారెడ్డి మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ కట్టడాలపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు, సంబంధిత అధికారుల బాధ్యతలను కూడా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి సంగారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పాటుపడాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వట్పల్లి పోలీస్ స్టేషన్, జోగిపేట సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలన. సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. మీరు నేర్చుకున్న ఈ పని సర్వీస్ కాలం ఉపయోగకరం. వట్పల్లి పోలీస్ స్టేషన్, జోగిపేట సర్కిల్ కార్యాలయ అధికారుల, సిబ్బంది పనితీరు బాగుంది. ల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.**

సంగారెడ్డి జూన్ 17 మనం న్యూస్ ప్రతినిధి: వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ వట్పల్లి పోలీస్ స్టేషన్, జోగిపేట సర్కిల్ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వట్పల్లి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. నూతన పోలీసు స్టేషన్ భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ను తనిఖీ చేస్తూ, పోలీసు శాఖ తరఫున అందించిన కిట్లోని ప్రతి వస్తువును జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనపరచుకున్న లేదా కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ కేసులు మరియు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు-రాత్రి బీట్ విధులలో నిఘా పెంచాలని ఆదేశించారు.

స్టేషన్కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను పరిశీలిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. పగలు, రాత్రి బీట్ విధులలో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలాన్ డివైస్ ద్వారా తనిఖీ చేసి, పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు.



తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుండి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్కు సూచించారు.

అనంతరం జోగిపేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులు, సర్కిల్ పరిధిలోని నాన్-గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదన కోసం సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జరిగిన నేరాల ఛేదనలో, నేరాల నియంత్రణలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ప్రతి దాబా, పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు సూచించాలని ఆదేశించారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న పనితీరు మీ సేవా కాలమంతా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచిస్తూ, హెల్మెట్ ధరించని సిబ్బందిని విధుల్లోకి అనుమతించకూడదని అధికారులకు సూచించారు.

సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంబడి సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, వట్పల్లి ఎస్ఐ శ్రీహరి, జోగిపేట్ ఎస్ఐ శ్రీకాంత్ మరియు సిబ్బంది ఉన్నారు.

# గాంధీ భవన్ ముందు సీఎం, టీపీసీసీ అధ్యక్షుడి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన జహీరాబాద్ నేతలు







జహీరాబాద్ జూన్ 17 మనం న్యూస్: రాష్ట్ర రాజధాని నగరమైన హైదరాబాద్ నగరం లోని నాంపల్లి గాంధీ భవన్ ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కే రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి మహేందర్ గౌడ్ లతోపాటు జహీరాబాద్ లోక్ సభ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్, జహీరా బాద్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టరు ఏ చంద్రశేఖర్ ల చిత్రపటాలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ అధ్యక్షులు క్షీరాభిషేకం చేశారు. జహీరాబాద్ నియోజక వర్గంలోని మొగుడం పల్లి, కోహీర్, జహీరాబాద్, న్యాల్ కల్, ఝరాసంగం మండలాలు, జహీరాబాద్, కోహీర్ పట్టణాలకు సంబంధించి నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో బుధవారం నాడు ఈ కార్యక్రమం జరిగింది.

ఆయా ప్రాంతాలకు నూతన కమిటీ అధ్యక్షుల నియామకాల్లో భాగంగా వారు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పాలాభిషేకం చేశారు. తామంతా కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేస్తామని వారు వెల్లడించారు. తాము అందరిని కలుపుకొని పార్టీ పటిష్టత కోసం అంకిత భావంతో పనిచేస్తామని వారు ప్రకటించారు. పార్టీ పెద్దల సూచనలు, అభిప్రాయాల మేరకు నడుచుకొంటామని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి సలుపుతామని జహీరాబాద్ ప్రాంత నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాల రుణాల లక్ష్య సాధనకు బ్యాంకులు కృషి చేయాలి

**అదనపు కలెక్టర్ పాండు**

సంగారెడ్డి, జూన్ 17 మనం న్యూస్ ప్రతినిధి : జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. బుధవారం కలెక్టరేట్లో మార్చి-2026 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ ( డిసిసి), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ ( డిఎల్ఆర్సి) సమావేశం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ పాండు అధ్యక్షత వహించగా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ సమావేశాన్ని సమన్వయం చేశారు.

ఈ సమావేశానికి ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ వెన్న, నాబార్డ్ ఏజీఎం/డీడీఎం






కృష్ణతేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, ప్రతినిధులు హాజరయ్యారు.

సమావేశంలో జిల్లా బ్యాంకింగ్ కార్యకలాపాలపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ కుమార్ సమగ్ర నివేదికను సమర్పించారు.

జిల్లాలో పంట రుణాల లక్ష్యం రూ.3,499.21 కోట్లకు గాను 90.66 శాతం, మొత్తం వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.6,816.57 కోట్లకు గాను 87.16 శాతం, మొత్తం అడ్వాన్సుల లక్ష్యం రూ.23,438.93 కోట్లకు గాను 92.81 శాతం సాధించినట్లు వివరించారు.

అదేవిధంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల ( ఎం ఎస్ ఎం ఈ) రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు, తదితర రంగాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.

ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో ప్రధానమంత్రి జనసురక్ష పథకాలైన ప్రధాన్ మంత్రి జనధన్ యోజన ( వి ఎం జె డి వై), ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజ పి ఎం జె జె వై), ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన ( ఈ ఎం ఎస్ బి వై), అటల్ పెన్షన్ యోజన (ఏపీ వై) పథకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మరింత మంది లబ్ధిదారులను చేర్చాలని సూచించారు. అలాగే రీ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం, ఖాతాలను నిరంతరం సక్రియంగా నిర్వహించుకోవడం గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

నాబార్డ్ ఏజీఎం కృష్ణతేజ మాట్లాడుతూ, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, పశుసంవర్ధక, మత్స్యరంగ రుణాల కింద అర్హులైన రైతులు, లబ్ధిదారులకు మరింతగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, డీఆర్డీఏ, డీపీసీ తదితర విభాగాల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి

**గోలి సంతోష్**

గజ్వేల్ జూన్ 17 మనం న్యూస్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని గోలి సంతోష్, అంతునూరి శివకుమార్ అన్నారు. మే నెలలో ఎండాకాలం సందర్భంగా స్థానిక ఇంద్ర పార్క్ చరస్త వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మూడు నెలపాటు ఈ చలివేంద్రా నిర్వహించడం జరిగిందని అలాగే ప్రతి బుధవారము చలివేంద్రం వద్ద అంబలి పంపిణీ కార్యక్రమం కానీ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం తోట భిక్షపతి మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధించిన ప్రజలు రావడం జరుగుతుందని వారికి ఇబ్బంది దాహంతో ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది తోట భిక్షపతి తెలిపారు. మూడు నెలల పాటు నిరంకరం ఈ చలివేంద్రాన్ని నిర్మించడం మాకెంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందాన్ని వెళ్ళి బుచ్చారు. ఈ సంవత్సరం వేసవికాలంలో ఈ బుధవారం అంబలి కార్యక్రమం చివరిగా నిర్వహించడంతో జనాలు అంబలి సేవించడానికి భారీగా తరలి రావడం జరిగింది.ఈ కార్యక్రమంలో దూపకుంట రుక్మయ్య, దూపకుంట మైత్రాములు, దూపకుంట లచ్చయ్య, దూపకుంట లక్ష్మణ్, సిద్ధి రామచంద్రం, తడుపునూరి కాశీనాథ్, రమేష్, మరియాల లింగం, తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

పుల్కల్ జూన్ 17 (మనం న్యూస్) పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితా దేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడిన ఆమె, వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది వ్యవహార శైలిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని పెంచే విధంగా సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలను కూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేల కోట్ల అప్పులు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ

**ప్రజా సమస్యలపై పోరాటలకు సిద్ధం కండి**

**మోడీ మోసాలను ఎండగట్టేందుకు**

**ఆగస్టు 6 నుండి సిపిఐ పాదయాత్రలు,**

**సెప్టెంబర్ 1 చలో ఢిల్లీ**




హుస్నాబాద్ రిపోర్టర్ జూన్ 17 మనం న్యూస్: సిపిఐ సినియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కార్యకర్తలకు పిలుపు. దేశాన్ని పాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ లక్షల కోట్ల అప్పులు చేసి దేశ సంపద నంత కార్పోరేట్ శక్తులకు దోచి పెలుతున్నాడని సిపిఐ సినియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు.

బుధవారం నాడు అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ లో హుస్నాబాద్ మండల కౌన్సిల్ సభ్యుల సమావేశని ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రధాని నరేంద్ర మోడీ 214 లక్షల కోట్ల అప్పులు చేసి దేశ ప్రజలపై పన్నుల రూపంలో భారం పెంచుతున్నాడని దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి సిపిఐ పాదయాత్రలు చేసి సెప్టెంబర్ 1 ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలకు కార్యకర్తలు ప్రజలు సిద్ధం కావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న అన్ని బిల్లులు వెంటనే మంజూరి చేయాలని పేదలకు ఇచ్చే ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా ఇవ్వాలని చాడ వెంకటరెడ్డి సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ,

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్

మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ,సిపిఐ మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, సిపిఐ మండల నాయకులు జంగ విజయ, కొయ్యడ కొమురయ్య, అయిలేని మల్లారెడ్డి, పిట్టల మొగిలయ్య, మాటం బాలయ్య, పుదరి రఘుపతి, పెద్ది నిర్మల, దండుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు పే స్లిప్పుల ద్వారా జీతాలిచ్చేలా చూడండి

**ఎంత పనికంతా వేతనం ఇప్పించండి**

**కాంట్రాక్టు కార్మికుల హక్కులను కాలరాసే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోండి**

**ఇండస్ట్రియల్ వర్కర్స్ వెల్ఫేర్ అండ్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు మున్నూరు గోవర్ధన్ డిమాండు**



జహీరాబాద్ జూన్ 17 మనం న్యూస్: జిల్లాలోని అనేక పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు నెలనెలా చెల్లించే జీతభత్యాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన పేస్లిప్ లను ఇవ్వడం లేదని, ఆయా పరిశ్రమల్లో  పేస్లిప్ లేకుండా వారికి జీతాలు చెల్లించడం ఎంతవరకు సమంజసమని ఇండస్ట్రియల్ వర్కర్స్ వెల్ఫేర్ అండ్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ  రాష్ట్ర అధ్యక్షులు మున్నూరు గోవర్ధన్ ప్రశ్నించారు. ప్రతి పరిశ్రమలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు నెలనెలా చెల్లించే జీతాలు పేస్లిప్పుల ద్వారా చెల్లించాలని ఆయన కోరుతూ అనేక పరిశ్రమల్లో అదనపు పని గంటలు పని చేస్తున్నా కాంట్రాక్టు కార్మికులకు ఆ అదనపు పనిగంటల మేరకు జీతాలు చెల్లించడం లేదని కూడా ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టు కార్మికులు రేయి పగలు చెమటోడ్చి రెగ్యులర్ కార్మికులకు మించి పని చేస్తున్నా ఆ పని చేస్తున్న పనితనానికి సంబంధించిన జీతాలు ఇవ్వక పోవడంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. సాధారణ పని గంటల కంటే ఎక్కువ సమయం పని చేయడం వంటి పద్ధతులను అనేక పరిశ్రమల యాజమాన్యాలు అనుసరించడం శోచనీయమని అన్నారు. ఈ విషయంలో కూడా జిల్లా కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయా పరిశ్రమలపై గట్టి నిఘా వేసి ఉంచాలని ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారంనాడు ఆయన జిల్లా కార్మికశాఖ అధికారికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఏ పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులు ఓవరు టైం (అదనపు పని గంటలు) పని చేస్తున్నారో? వారికి ఎంత పనికి అంత జీవితం ఇస్తున్నారో?లేదో? సమగ్రమైన పారదర్శకమైన విచారణ జరిపించాలని ఆయన కోరారు. ఓవర్ టైం పని తనానికి సంబంధించి జీతం ఎంత ఇస్తున్నారో? పిఎఫ్ కటింగ్ ఎంత చేస్తున్నారో? డిఏ పెరిగిందా? లేదా? అనే విషయం వంటివి కాంట్రాక్టు కార్మికులకు తెలియడం లేదని ఆయన  గుర్తు చేశారు. పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు తమ శ్రమకు తగిన విధంగా జీతాలు వస్తున్నాయా? లేదా? అనే విషయంలో తెలుసుకోలేని స్థితిలో ఉన్నారని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాంట్రాక్టు కార్మికులు అనేక సమస్యలతో సతమతమ వుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరంగా కాంట్రాక్టు కార్మికులకు వర్తించే అన్ని సదుపాయాలు పరిశ్రమల యాజమాన్యాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. అలా చెల్లించలేని పరిశ్రమ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కోరారు. పరిశ్రమలో జరిగే వివిధ ప్రమాదాలకు సంబంధించి డిసిఎల్ కానీ పరిశ్రమల ఇన్ స్పెక్టరు  గానీ సరైన సమాచారం అందించడం లేదని, ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు సమగ్రమైన సమాచారాన్ని అందించి, కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేకూర్చా లని ఆయన కోరారు. ఇక నుంచి కాంట్రాక్టు కార్మికులకు కూడా ప్రతి నెల నెలా పేస్లిపులు ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. పేస్లిప్పు లేకుండా జీతాలు ఇచ్చే పరిశ్రమ లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే సాధారణ పని గంటల కంటే ఎక్కువ  సమయం పని చేయిస్తున్న పరిశ్రమలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కనీస వేతనాల చట్టం చేసి, కాంట్రాక్టు కార్మికులకు అండగా నిలిచినందుకు ఆయనకు ఆ కార్మికుల తరఫునుంచి మున్నూరు గోవర్ధన్ ప్రత్యేకించి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన అంశాలపై వెనువెంటనే చట్టాలు చేయడం, వారికి ప్రోత్సహించి, వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మున్నూరు గోవర్ధన్ ప్రత్యేకించి అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కార్మికుల హక్కులకు తగు న్యాయం లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తు న్నందుకు ఆయన కాంట్రాక్టు కార్మికుల తరఫున మరోమారు తమ హర్షం వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లా కార్మిక శాఖ అధికారి జిల్లాలోని పరిశ్రమలపై తగు చర్యలు తీసుకొని కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గౌడ సోదరులకు కాటమయ్య కిట్లు పంపిణీ




గజ్వేల్ జూన్ 17 మనం న్యూస్ : ఈదులు, తాళ్లు ఎక్కి కల్లు గీసే గౌడ సోదరుల కోసం కాటమయ్య రక్ష కిట్లను గజ్వేల్ ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఎస్సై దీప్తి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం పోషాద్రి అందించారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గం గౌడ సంఘం సోదరులకు 90 కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ  చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలాసార్లు ప్రమాదాల బారిన పడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రమాదాల నివారణకు కాటమయ్య కిట్లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను ప్రభుత్వం తయారు చేసి అందిస్తుంది అని విన్నవించారు. గీత కార్మికులు సులువుగా తాటి చెట్లు ఎక్కేలా ఈ కిట్లను రూపొందించారు అని చెప్పారు.ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు అని వ్యాఖ్యానించారు. ఒక్కో కిట్లో మొత్తం 6 పరికరాలు ఉంటాయి అని తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి అని వివరించారు. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే ఈ పరికరాలు ఉంటాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై వినయ్ కుమార్ పోలీస్ సిబ్బంది మరియు గౌడ్ సంఘం సభ్యులు నాచారం గౌడ్ సంఘం సొసైటీ అధ్యక్షుడు చింతల సంతోష్ గౌడ్, నాగరాజ్ గౌడ్, వి, లింగం , శ్రీధర్, రాజయ్య, అంజయ్య, శ్రీనివాస్, ప్రసాద్ యాదగిరి, మండల గౌడ్ సంఘు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇన్చార్జి కార్యదర్శి మాకొద్దు

**తన ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి**

**రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి**

**ఉప సర్పంచ్ వేల్పుల ప్రవీణ్ కుమార్**



మనం న్యూస్ రేగోడ్ జూన్17:- రేగోడ్ మండలం ప్యారారం గ్రామ పంచాయతీ కార్యదర్శి దివ్య ప్రియ సుమారు రెండున్నర సంవత్సరాల నుండి ఇంచార్జ్ కార్యదర్శిగా తన ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నరూ అంటూ ప్యారారం గ్రామ ఉపసర్పంచ్ వేల్పుల ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఇష్టం వచ్చినప్పుడు విధులకు వస్తారని, పంచాయతీ కార్యాలయంలో స్థానికంగా ఉండరని ప్రభుత్వం ప్రవేశపెట్టిన పతకాలను ప్రజలకు తెలియజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, గ్రామానికి సంబంధించిన మీటింగ్లకు గ్రామ ఉపసర్పంచు, మెంబర్లకు సమాచారం ఇవ్వకుండా మీటింగ్ నిర్వహిస్తారని, విధులలో కూడా నిర్లక్ష్యంగా వారానికి రెండు లేదా మూడుసార్లు మాత్రమే రావటం ఏమిటని అన్నారు. ఇక్కడున్న రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి కి మరోచోట డిప్టేషు పంపించడంపై విస్మయం కలిగిస్తుంది అని అన్నారు. మండల ఎంపీడీఓ నే ఇంచార్జి అంటే మళ్ళీ కార్యదర్శులు కూడా ఇంఛార్జి లేన అని అసలు మా మండలం పై అధికారులకు ఇంత నిర్లక్ష్యం ఎందుకని మండిపడ్డారు. ఇప్పటికైనా రెగ్యులర్ కార్యదర్శిని నియమించి ప్రజల సమస్యలను తీర్చాలని పై అధికారులను కోరుతున్నామన్నారు.



# మృతుని కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ కు చెందిన గుండ్ల రమేష్ 37   వ్యవసాయ కూలిగా జీవనం గడుపుతున్నాడు. అనుకోకుండా   హార్ట్ ఎటాక్  తో గత వారం చనిపోవడం జరిగింది. మృతునికి  ఒక  పాప, ఒక బాబు .రమేష్  చనిపోవడం వల్ల వీరి పరిస్థితి గమనించిన  పదవ తరగతి 2004- 2005  బ్యాచ్  కు చెందిన  మిత్రులు కలిసి వీరికి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, 34 వేల రూపాయలు ఆర్థిక సహాయము  అందజేయడం జరిగింది. . తోటి మిత్రుడు చనిపోతే ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడం హర్షించదగ్గ విషయమని అందరూ కొనియాడారు.

# డివైడర్‌కు ఢీకొని వ్యక్తి మృతి



వర్గల్ జూన్ 17 మనం న్యూస్: బైకుతో డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్సై ఆరోగ్యం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన బల్లచోళ్ళ కనకయ్య (48) షామీర్పేట్ కట్ట మైసమ్మ వద్ద బంధువుల దావత్ కు హాజరై తిరిగి ఇంటికి తన మోటార్ సైకిల్ పై వస్తున్న క్రమంలో గౌరారం సమీపంలోని ఫామ్ స్టే రిసార్ట్ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో తలకి గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుని కొడుకు మహేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గౌరవరం పోలీసులు తెలిపారు .

## కోహీర్ లో షాహీన్ ఫ్యూచర్ నూతన స్కూల్‌ను ప్రారంభించిన టీజీ ఐడిసి మాజీ ఛైర్మన్ తన్వీర్







జహీరాబాద్ జూన్ 17 మనం న్యూస్: కోహీర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన షహీన్ ఫ్యూచర్ స్కూల్ ను తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మొహమ్మద్ తన్వీర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రిబ్బన్ కత్తిరించి, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొహమ్మద్ తన్వీర్ మాట్లా డుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ విలువలను అందించే విద్యాసంస్థలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని ఉద్ఘా టించారు. విద్యా రంగంలో షహీన్ గ్రూప్ విద్యా సంస్థలు అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల ద్వారా మంచి విజయాలను సాధించాలని మొహమ్మద్ తన్వీర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా మున్సిపల్ వైస్ ఛైర్మన్ అబ్దుల్ హన్నాన్ జావిద్, మాజీ ఎంపిటిసి మాజీ సభ్యుడు మొహమ్మద్ ఖుతుబుద్దీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బిజి సందీప్, షాహీన్ విద్యా సంస్థల యాజమాన్యం, వివిధ ప్రాంతాల విద్యావేత్తలు, పలువురు పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలి

**పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ**





జిన్నారం, జూన్,17:(మనం న్యూస్) : ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముకలని, కళాశాల స్థాయి నుంచే డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకొని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల కోరిక మేరకు అతి త్వరలో బెంచీలు అందచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణ కుమార్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# పేదల సొంత ఇంటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ హనుమంతరావు పాటిల్**

ఝరాసంగం. జూన్ 17.మనం. న్యూస్: పేదల ఇళ్ల కల సాకారం కాంగ్రెస్ తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ పీ హన్మంత్ రావు పాటిల్ అన్నారు.బుధవారం ఝరాసంగం మండలం బిడికన్య గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఝరాసంగం సీనియర్ నాయకులు హన్మంత్ రావు పాటిల్ హాజరై గృహ యజమానులను అభినందించారు. ఈ కార్యక్రమం లో. సర్పంచ్. రవి. కుమార్.. వేణుగోపాల్ రెడ్డి. సిద్దన్న. పాటిల్.నాయకులు బంధుమిత్రులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# నేడు విద్యుత్ అంతరాయం

వర్గల్ జూన్ 17 మనం న్యూస్: విద్యుత్ ప్రమాదాలను నివారించుటకు11 కె.వి విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గౌరారం, బోర్రగూడెం, చందాపూర్, శాకారం, తునికి ఖాల్సా గ్రామాల్లో గురువారం ఉదయం 9-00గంటల నుండి12-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ వాసుదేవరావు తెలిపారు. విద్యుత్ అంతరాయం పట్ల ప్రజలు సహకరించాలని కోరారు.

# పుస్తకాలు సీజ్

**ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాల విక్రయిస్తున్న ఆల్ఫోర్స్ పాఠశాల పుస్తకాలు పట్టుకోవడంతో ఎంఈఓ మనీలా వచ్చి పుస్తకాలను సీజ్ చేయడం జరిగింది - ఏ బీ వీ పీ**

హుస్నాబాద్, రిపోర్టర్: జూన్ 17మనం న్యూస్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఆల్ఫోర్స్ పాఠశాలలో అక్రమంగా అమ్ముతున్నటువంటి పుస్తకాలు మరియు నోటుబుక్కులు సీజ్ చేపియడం జరిగింది





ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పిల్లలకు చదువును దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని సరస్వతి నిలయాలుగా ఉండాల్సిన పాఠశాలలే వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుస్తకాల విక్రయిస్తున్న ఆల్ ఫోర్స్ స్కూల్ పుస్తకాలను పట్టుకోవడంతో ఎంఈఓ మనీలా వచ్చి పుస్తకాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అన్ని స్కూళ్లు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించనిచో కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ మనీలా తెలిపారు

ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్ జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ చరణ్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కుమార్ కళాశాల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు



# హెటెరో ల్యాబ్స్ నిధులతో నల్లచెరువు సుందరీకరణ

## పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ : కుమార్ గౌడ్.





గుమ్మడిదల( మనం న్యూస్ ) జూన్ 17 : గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు గ్రామంలో నల్లచెరువు సుందరీకరణకు హెటెరో ల్యాబ్స్ సి ఎస్ ఆర్ నిధులతో సుందరీకరణ పనులను పుష్పల్ చైర్మన్ చిన్న పాపాని కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెట్రో పరిశ్రమ సి ఎస్ ఆర్ నిధులతో పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. చెరువు పరిసరాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు బివి రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు అబిశెట్టి రాజశేఖర్, నర్సంపల్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుందరీకరణ విషయంలో దోమడుగు గ్రామస్తులు పరిశ్రమ తీరుపై కాసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు ఆ సమయంలో అక్కడే ఉన్నందున సద్దుమణిగిందని చెప్పవచ్చు. గ్రామస్తులు పరస్పర విమర్శలు చేసుకోవడం పలువురిని ఆశ్చర్యం కలిగించింది.

# లక్ష్మీ ప్రసన్న నగర్లో ట్రాన్స్ఫార్మర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి

గజ్వేల్ జూన్ 17 మనం న్యూస్: లక్ష్మీ ప్రసన్న నగర్లో ట్రాన్స్ఫార్మర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి కాలనీవాసులు విద్యుత్ శాఖ మరియు మున్సిపల్ శాఖ అధికారులు కోరుతున్నారు. తాత్కాలిక ఏర్పాటులో భాగంగా ఇనుప స్టూల్ పై ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ఎంతో ఇబ్బందికరంగా మారిందని ఆ స్థలంలోనే పర్మినెంట్ ఉండేలా గద్దె ఏర్పాటు చేసి ఇబ్బంది పడకుండా ఉండాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# న్యాల్ కల్ మండలంలో నేడు త్రీఫేస్ విద్యుత్తు సరఫరా బూకట్'



జహీరాబాద్ జూన్ 17 మనం న్యూస్: న్యాల్ కల్ మండలంలో ఈనెల18వ తేదిన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఆ మండల విద్యుత్తు శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో యదా విధిగా సింగిల్ ఫేస్ విద్యుత్తు సరఫరా కొనసాగుతుందని వారు ప్రకటించారు. జహీరాబాద్ - బీదర్ రోడ్డు, న్యాల్ కల్ మండలం, మెటల్ కుంట విద్యుత్తు ఉపకేంద్రం వరకు ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించనున్నందునే ఈ త్రీఫేస్ విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు మండల విద్యుత్తు వినియోగదారులు తమ శాఖకు సహకరించాలని మండల విద్యుత్ అధికారి అర్జున్ రావు బుధవారంరాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు.

# శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి ప్రత్యేక పూజలు





ఝరాసంగం, మనం న్యూస్ జూన్ 17: దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం లోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ బుధవారం సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ప్రముఖులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి శివ రుద్రప్ప ఆధ్వర్యంలో రాజగోపురం వద్ద అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి శివ రుద్రప్ప, అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో ప్రజలకు సకల సౌకర్యాలు

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జిన్నారం ,జూన్;17,(మనం న్యూస్ ): గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని.. త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

బుధవారం ఉదయం ఖాజిపల్లి పరిధిలోని జిఎంఆర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సర్వేనెంబర్ 181 లో ప్రజల సౌకర్యార్థం గుడి, మసీదు, చర్చి, స్మశాన వాటిక, అంగన్వాడి, చట్ పూజ ఘాట్, క్రీడా మైదానం, ప్రాథమిక పాఠశాల నిర్మాణాలకు త్వరలో స్థలాలు కేటాయించి..భవన నిర్మాణాల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్డు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిఎంఆర్ కాలనీలో గ్రామ దేవత గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మ శ్రీకాంత్, తహసిల్దార్ ఆంథోనీ, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.